


# సరదా తీరింది

**సీతాసత్య**

దేశ సౌభాగ్యానికి పల్లెటూళ్లు పట్టుకొమ్మలవునో కాదో గానీ నాకూ వాసంతికీ ఎప్పటినుంచో పల్లెటూరి జీవితం ఎలా ఉంటుందో స్వయంగా అనుభవించి చూడాలని కోరిక. ఆ కోరికలో మా స్వార్థం కూడా వుంది. పల్లెటూళ్ళలో వాతావరణం ప్రశాంతంగా వుంటుంది. రణగొణ ధ్వనులుండవు. కొనేందుకేమీ ఉండవు. కనుక ఖర్చూ తక్కువే! బంధువుల తాకిడి గురించి పూర్తిగా మర్చిపోవచ్చు. మనింట్లో మనం హాయిగా ఒకరికోసం మరొకరన్నట్టుగా ఉండొచ్చు.

మా సంస్థకు సంబంధించిన కొన్ని శాఖలు పల్లెటూళ్ళలో కూడా ఉన్నాయి. అందుకే పిల్లాపీచూ కలగక ముందే కొంతకాలంపాటు ఏ పల్లెటూళ్ళోనో పనిచేసి ఆ జీవితాన్ని తనివితీరా ఆస్వాదించటంతోపాటు నాలుగు డబ్బులు వెనకేసుకోవాలని నా కోరిక. నేను ఒకానొక పల్లెటూళ్ళో ఉన్న శాఖకు బదిలీకోసం దరఖాస్తు చేశానని తెలియగానే చాలామంది మమ్మల్ని నిరుత్సాహపరిచారు.

అయినాసరే మా ఇద్దరికీ ఆ విషయంలో ఏకాభిప్రాయం ఉండటంతో మేమెవరి మాటల్నీ పట్టించుకోలేదు. దరఖాస్తు చేసిన నెలరోజుల్లో మేము కోరుకున్నట్టుగానే నాకు ఆ ఊరికి బదిలీ అయినట్టుగా ఉత్తర్వు అందింది. ఆరోజు మా ఇద్దరి ఆనందానికీ పట్టపగ్గాలు లేకుండా పోయాయి.

☆ ☆ ☆

"అబ్బా..ఎంత పెద్ద ఇల్లండీ!" ఇల్లంతా కలియ తిరిగి మురిసిపోతూ, ఇంటి ముందు విశాలంగా ఉన్న అరుగుమీద గోడకు ఆనుకుని కూర్చుని సంబరంగా అంది వాసంతి.

నేనేదో చెప్పబోతోంటే, మాకా ఇల్లు చూపించిన పెద్ద మనిషి "మీకిల్లు నచ్చినట్టే కదా!" అన్నాడు.

"నచ్చడమా! ఈ ఇల్లు నచ్చలేదని అనేవాళ్ళు గుడ్డివాళ్ళైనా అయివుండాలి లేదా పిచ్చివాళ్ళైనా అయ్యుండాలి" అన్నాను నేను.

"హమ్మయ్య....ఇహ నేను వస్తాను" అంటూ ఎవరో తరుముకొస్తున్నట్టుగా జారుకోబోయాడతడు.

రెండంగల్లో అతణ్ణి చేరి, అతని చేయి పట్టుకుని, నా వైపు తిప్పుకుంటూ "అద్దెంతో చెప్పకుండా అలా వెళ్ళిపోతున్నారేమిటీ?" అన్నాను.

అతను నా చేతిని అతి కష్టంమీద వదుల్చుకుని "మీరీ ఇంట్లో రోజూ దీపం పెడితే చాలు...అంతకంటే ఏమీ అక్కర్లేదు" అన్నాడు.

"అంటే..ఈ ఇంటికి నిజ్జంగా అద్దె ఏమీ ఇవ్వనవసరం లేదా?" అతని చేతిని గిల్లేందుకు చేతిని ముందుకు చాపుతూ అన్నాను.

అతడు నా చేతి వ్రేళ్ళకు దొరక్కుండా లాఘవంగా పక్కకు తప్పుకుని, "ఈ ఇంటిగలాయన భార్య పోవడంతో, పెద్ద వయసులో ఒంటరిగా ఉండలేక ఊరొదిలిపెట్టి దూరంగా పిల్లల దగ్గర ఉంటున్నాడు. తాతలనాడు కట్టించిన ఈ లంకంత కొంపలో దీపం పెట్టే దిక్కు లేదని నా దగ్గర తరచూ వాపోతూ, ఎవరైనా ఈ ఇంట్లో ఉంటానంటే అద్దె ప్రసక్తి లేకుండా ఎంత కాలమైనా ఉండొచ్చుననీ ఈ విషయంలో నాకు సర్వాధికారాలూ ధారాదత్తం చేసి వెళ్ళిపోయాడు కనుక మీరు అద్దె గురించి మర్చిపోయి ఈ ఊళ్ళో ఉన్నంతకాలమూ ఈ ఇంట్లో ఉంటే అదే పదివేలు" అని నేను చెప్పే మాటల్ని వినిపించుకోకుండా ఇంటి తాళం చెవుల్ని నా చేతుల్లో వుంచి, పరుగులాంటి నడకతో గేటు దాటి వెళ్ళిపోయాడు.

ఆ పెద్ద మనిషి పేరేదైనప్పటికీ మాకు మాత్రం ఆ సమయంలో ఆయన మేము చిన్నప్పుడు చందమామ కథల్లో చదువుకున్న పరోపకారి పాపన్నను స్ఫురింపచేశాడు.


"అదేవిటీ! ఎవరో తరుముకొచ్చినట్టు ఆయనలా పారిపోతున్నాడు? ఈ ఇల్లు కొంపదీసి దెయ్యాలకొంప కాదు కదా! ఇంత పెద్ద ఇల్లు, ఊరికి దూరంగా విసిరేసినట్టుగా, విడిగా ఇంత విశాలమైన ఆవరణలో చెట్లూ, పుట్ల మధ్య ఇంతకాలం ఖాళీగా ఉందంటే...నాకేదో అనుమానంగా ఉంది" అంది వాసంతి.

నా మనసులోనూ అవే ఆలోచనలు కలగాపులగంగా కదలాడుతోన్నా, "అఖ్ఖే నీదంతా విపరీతం. ఇదసలే పల్లెటూరు కదా! ఎవరిళ్ళు వారికుంటాయి. ఇల్లు పెద్దదైనంత మాత్రాన స్వంత ఇల్లు వదిలిపెట్టి ఊరికే వచ్చింది కదా అని ఈ ఇంట్లోకి ఎవరు మారతారు? మనవంటే ఉద్యోగరీత్యా ఈ పల్లెటూరికొచ్చాం కాబట్టి మనకు తప్పదు. అనవసరంగా ఏదేదో ఊహించుకుని ఆందోళన పడకు!" అన్నాను.

నా మాటలతో కొంచెం ఊరట చెందిన వాసంతి, "సరేలెండి. ఏదో ఊహించుకుని ముందుగానే దిగులు పడడమెందుకు? అలా ఊళ్ళోకెళ్ళి పెరడు శుభ్రం చేయడానికి ఎవరినైనా మాట్లాడండి. వచ్చేవారం మనం ఇంట్లో దిగేలోపు, ఇల్లంతా కడిగించి అన్ని గదులకూ వెల్లవేయించే ఏర్పాట్లు కూడా ఆ ఇల్లు చూపించిన పాపన్నగారికే అప్పచెప్పేస్తే సరి" అంది.

☆ ☆ ☆

వారం రోజుల తర్వాత తట్టా బుట్టా చిన్నవ్యానులో వేసుకుని ఆ ఇంటిముందు దిగిన మాకు..పాపన్నగారు ఘనస్వాగతం



చెప్పారు. నీళ్ళకూ, పాలకూ ఏర్పాట్లు చేయడమేకాక, ఇంట్లో పనిచేసేందుకు ఓ ఆడమనిషిని కూడా చూసిపెట్టాడాయన. అంతటి మహోపకారం చేసి ఊరుకోవడమే కాకుండా అడక్కుండానే వరాలిచ్చే దేవుడిలా "మీకేదైనా అవసరమైతే మొహమాటపడకుండా నాకు కబురుపెట్టండి" అని వెళ్ళిపోయాడు.

ఆ ఊళ్ళో ఏ ఇంటికీ కుళాయిల ద్వారా నీళ్ళు వచ్చే సదుపాయం లేదు. బిందెకు రెండు రూపాయలిచ్చి నీళ్ళు కొనుక్కోవాలి. రోజుకు పది బిందెలు చూసుకున్నా నీళ్ళకు నెలకు ఆరు వందలు ఖర్చు. ఆ మాత్రం డబ్బులుపోతే పోయాయి, ఎటూ ఇంటి అద్దె లేదు కదా అని సరి పెట్టుకున్నాం. మేం భయపడనట్టుగా ఆ రాత్రి గానీ, తర్వాతగానీ ఎటువంటి దెయ్యాలూ మా మీద దాడి చేయలేదు.

కాకపోతే వాగు నుంచి తెచ్చిన నీళ్ళు మా చర్మాలకు సరిపడకపోవడంవల్ల కాబోలు ఓ వారం రోజుల తర్వాత అర్ధరాత్రి నిద్రలేచి పొద్దు పొడిచే వరకూ నేనూ వాసంతీ ముందుగా ఒకరి వీపును మరొకరూ తర్వాత మిగిలిన సర్వావయవాల్నీ ఎవరి చేత్తో వారూ యధాశక్తి గోక్కుని గాఢ నిద్రలో ఉన్న మమ్మల్ని జాగరూకుల్ని చేసిన బాధ నుంచి తాత్కాలిక ఉపశమనం పొందాం.

మర్నాడూ, ఆ మర్నాడూ కూడా అదే సమయానికి మళ్ళీ అదే పని చేయవలసి వచ్చింది. ఇలా అయితే...త్వరలోనే నఖరహిత, చర్మరహిత మానవులుగా మారిపోయే అవకాశముందని గ్రహించిన వాళ్ళమై భక్తిశ్రద్ధలతో రెండు రెళ్ళు నాలుగు చేతులూ జోడించి 'పాహిమాం' అని పాపన్నగారి ముందు మోకరిల్లాం.

ఆయన వెంటనే తన కరుణాకటాక్ష వీక్షణాల్ని మా మీద ప్రసరింపజేసి తన ఇంట్లోంచి ఓ వీశెడు భస్మాన్ని జాగ్రత్తగా పొట్లం కట్టి తెచ్చి మా చేతుల్లో పెట్టి "స్నానానికి ఓ గంటముందు మొహమాట పడకుండా ఒళ్ళంతా పట్టించండి. వారంరోజుల తరువాత మీకు గోళ్ళతో పనుండదు. వాటి మానాన అవి ఏపుగా పెరుగుతాయి ఎప్పట్లానే" అన్నాడు.

'గోళ్ళతో పనుండదన్నాడంటే, కొంపదీసి రేపటినుంచి మా వీపుల్ని ఇంట్లోని గోడలకేసి రుద్దుకోవాల్సిన అదృష్టం పట్టదుకదా!' అనిపించింది మా ఇద్దరికీ ఏకకాలంలోనే.

మా మనసులోని భావాల్ని చదివిన త్రికాలజ్ఞానిలా నవ్వి "అదేం జరగదు. మీ గోళ్ళలానే మీ ఇంటి గోడలు కూడా సురక్షితంగా వుంటాయి. వెళ్ళిరండి" అన్నాడాయన ఎంతో దయకురిపిస్తూ.

☆ ☆ ☆

మేం ఆ ఇంట్లోకి ప్రవేశించిన నెల రోజులకు వర్షాకాలం మొదలైంది. వర్షమంటే నాకూ, వాసంతికీ చాలా ఇష్టం. పట్టణాల్లో ఎలానూ వానలో తడుస్తూ 'వానావానా వల్లప్పా' ఆడడం కుదిరే పని కాదు. ఈ ఊళ్ళో ఆ సరదా తీరబోతోందని మాకెంతో సంతోషం కలిగింది. వర్షంలో తడుస్తూ మురిసిపోవాలన్న మా కోరిక వర్షాకాలం ప్రారంభమైన ఏడోరోజున తీరింది.

## ఎన్నెన్నో తిప్పలు

'ఆది' లాంటి సూపర్ హిట్ సినిమాలో నటించినా కూడా తెలుగులో అంతంతమాత్రంగానే చాన్సులతో తృప్తి పడి తమిళ నాట అడుగుపెట్టింది కీర్తిచావ్లా. అక్కడామెకి తెలుగుకన్నా మంచి ఆదరణే లభించింది. అయితే ఇంకా సంచలనం సృష్టించి క్రేజ్ తెచ్చుకోవడానికి ఏం చేయాలా అనే ఆరాటంలో వున్న కీర్తి, రాబోయే ఓ తమిళ చిత్రంలో తెగ రెచ్చిపోయి తన అందాలను ఆరేసిందిట. ఈ సినిమాలో కీర్తి అందాలు పెద్ద అట్రాక్షన్ అవుతుంది అంటున్నారు తమిళ సినీజనాలు. ఈ సినిమాతో అయినా రాంకింగ్స్‌లో ముందుకెళుతుందేమో కీర్తి.



ఆకాశంనుంచి ధారలా పడుతున్న వర్షంలో చెట్టాపట్టాలేసుకుని ఆడిపాడి మా చిరకాల వాంఛను నెరవేర్చుకున్నాం. మర్నాటినుంచీ జలుబూ, దగ్గూ, జ్వరమూ ఏ మాత్రం పక్షపాతము లేకుండా మా ఇద్దరినీ సమానంగా వరించడంతో మేం నెరవేర్చుకున్న చిరకాల వాంఛకు ఖరీదు అచిరకాలంలోనే పక్క ఊళ్ళో ఉన్న డాక్టర్‌కు చెల్లించాం.

జీవితంలో ఇంకెప్పుడూ అటువంటి ఆటలు ఆడకూడదని ఒట్టు కూడా పెట్టుకున్నాం. కానీ మేం ఆడకూడదని ఒట్టుపెట్టుకున్న ఆటను మా ప్రమేయం లేకుండానే మరో నాలుగు రోజుల తర్వాత ఇంట్లోనే ఆడాల్సి వచ్చింది మా కిష్టంలేక పోయినా.

ఓ రాత్రి మంచినిద్రలో ఉండగా ఒంటికేదో చల్లగా తగిలింది. వాసంతిది మొద్దునిద్ర. నాకు ఎంత నిద్రలో ఉన్నా చీమ చిటుక్కుమన్నా మెలకువ వస్తుంది. బుగ్గమీద చల్లగా అనిపించడంతో అప్రయత్నంగా వేళ్ళతో తడిమాను. చేతికేదో తడిగా తగిలింది. ఏమిటది?

ఈసారి టప్ మని నుదుటి మీద ఏదోపడింది. వెంట వెంటనే ముక్కుమీద, కంఠం మీద, టప్ టప్ మని నీటి చుక్కలు..'వర్షం ఇంట్లో కురుస్తోందా? లేక నేను ఆరుబయట పడుకుని ఉన్నానా? ఇవేవీ కాకపోతే ఇది కలా?' చటుక్కున మంచం మీది నుంచి లేచి లైట్ స్విచ్ వేశాను. మంచం మీద ముసుగ దీసుకుని దుప్పట్లో హాయిగా పడుకుని వుంది వాసంతి.

తల పైకెత్తి గది కప్పు వైపు చూద్దును కదా! వర్షపు నీటి చుక్కలు పై కప్పు నుంచి వ్రేళ్ళాడుతూ ఏ క్షణాన్నైనా జారిపడేందుకు సిద్ధంగా ఉన్నట్టు కనిపించాయి. నేను చూస్తోండగానే అరడజను నీటి చుక్కలు వాసంతి మీదా, మిగిలినవి మంచం చుట్టూ నేలమీదా పడ్డాయి. నిద్రలోనే ఉలిక్కిపడి మంచం మీద చటుక్కున లేచి కూర్చుంది వాసంతి.

అప్పటికే మేం పడుకున్న మంచం చుట్టూ నేలంతా తడిగా మారింది. మంచం మీద నుంచి క్రిందకు దిగబోయిన వాసంతి తన ప్రయత్నాన్ని విరమించుకుని కాళ్ళు పైకి లాక్కుని దుప్పటిని వళ్ళంతా కప్పుకుని నా వైపు చూస్తూ " ఈగదేనా? మిగిలిన గదులూ ఇలానే ఉన్నాయా?" అంది.

పరిమాణంలోనూ, బరువులోనూ ఆడవాళ్ళ మెదడు మగవాళ్ళ మెదడుకంటే చిన్నదని ఎక్కడో చదివాను. కానీ ఆ సమయంలో అది తప్పనిపించింది. కనీసం మా ఇద్దరి విషయంలోనూ అది వర్తించదనిపించింది.

ఇందాకటి నుంచీ పై కప్పునుంచి నీళ్ళు కారడవేవిటనే దిగ్భ్రమలోనే ఉన్నాను తప్ప, తాత్కాలిక పరిష్కారంగా మిగిలిన గదుల పరి

స్థితి లేవిటో చూడాలనే ఆలోచనే రాలేదు నాకు.

కరణేషు మంత్రీ సలహా ననుసరించి, ఆ ప్యాలెస్‌లోని మిగిలిన గదుల పరిస్థితి పరిశీలించాను. మేం పడుకున్న గది తప్ప, మిగిలిన గదులన్నీ బాగానే వున్నాయి. వెంటనే మంచాన్ని సాయంపట్టి పక్క గదిలోకి పడక మార్చి నిద్రకు ఉపక్రమించాను.

మర్నాడు రాత్రి నాకంటే ముందుగా వాసంతి లేచి కూర్చుని నన్ను తట్టి లేపి మరో గదిలోకి మకాం మార్పించింది. ఇలా వారం రోజుల్లో పిల్లి పిల్లల్ని మార్చినట్టుగా పడకను ఒకో గదిలోకి మారుస్తూ కాలక్షేపం చేస్తూ వచ్చాం. ఎనిమిదోరోజు కూడా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తూనే ఉండడంతో మాకు భయం వేసింది. వేరే గదిలోకి మా పడక మార్చేందుకు ఇహ ఆ ఇంట్లో వేరే గదులేం లేవు మరి!

మాయదారి వర్షం తగ్గితే ఏదైనా ఉపాయం ఆలోచించొచ్చు. ఈలోగా రోజులు గడపడం ఎలా? నా మట్టిబుర్రకు పదును పెట్టగా.. పెట్టగా ఒక ఉపాయం తట్టింది.

"ఈ వేళ్టినుంచి మనం గదులు మారనక్కర్లేదు. చూస్తూండు..ఏం చేస్తానో!" అని వెంటనే ఆలస్యం చేయకుండా గొడుగు వేసుకుని దగ్గర్లో ఉన్న పట్టణానికి వెళ్ళి నాక్కావాల్సిన వస్తువులు తెచ్చాను.

నేనొచ్చే వరకూ బిక్కుబిక్కుమంటూ దిగులుగా కూర్చున్న వాసంతి నన్ను చూడగానే ఆశగా ఎదురొచ్చింది. ఆమెను పట్టించుకోకుండా సరాసరి పెరట్లోకి వెళ్ళి నిచ్చెనను తీసుకొచ్చి గదిలో ఓ మూల గోడకు వేశాను. నిచ్చెనను కదలకుండా పట్టుకోమని వాసంతికి చెప్పి గోడమూలలో సరిగ్గా పైకప్పు క్రిందిభాగంలో నాలుగంగుళాల మేకునోదాన్ని కొట్టాను. తరువాత అదేవిధంగా మిగిలిన మూడు మూలల్లోనూ మేకులు దిగ్గొట్టాను. తరువాత సంచిలోంచి నేను కొన్న వెడల్పాటి పాలిథిన్ షీట్ తీశాను. దాని నాలుగుమూలలా పురికొన ముక్కల్ని కట్టాను.

మళ్ళీ నిచ్చెనను ఒక్కోమూలకూ తీసుకెళ్ళి పాలిథీన్ షీట్ మూలల్లో నేను కట్టిన పురికొసల తాలూకు చివర్లను మేకులకు కట్టాను. నాలుగు వైపులా కట్టడం పూర్తయ్యాక గది మధ్యలో నిలబడి సంతృప్తిగా పైకి చూశాను. నేను కట్టిన పాలిథిన్ షీట్ పై కప్పు క్రింది భాగమంతా ఆవరించి ఫాల్స్ సీలింగ్‌లా ఏర్పడింది. ఇహ వానదేవుడు కూడా ఏం చేయలేడు.

కాకపోతే అర్ధరాత్రి షీట్‌మీద పోగుపడిన వర్షపు నీటిని ఒక కర్రతో పైకెత్తి గోడకు ఒక వారగా పడేలా బకెట్‌లోనో, బిందెలోనో పట్టుకుని ఆ నీటిని బయట పారబోయాలి. అంతే! నా పని పూర్తయ్యాక విజయగర్వంతో చూశాను వాసంతి వైపు. ఏడవ లేక నవ్వింది వాసంతి.

ఆ రాత్రి మూడుసార్లు నిద్రలేచి పై కప్పుమీది నుంచి పాలిథీన్ షీట్‌లో పోగుపడిన నాలుగు బక్కెట్ల నీళ్ళను కర్రసాయంతో మంచంమీద పడకుండా గోడవారకు నడిపించి బక్కెట్లలోకి ఒడిసిపట్టి బయట పారబోశాను విజయవంతంగా.

ఈ ఉపాయం మూడు రోజులు పనిచేసింది. నాలుగోరోజు మేకులకు కట్టిన పురికొన ముక్కలు తెగి షీట్ క్రిందకు వ్రేళ్ళాడి ఆ నీళ్ళన్నీ మా మీద పడడంతో చలికి వణికిపోతూ కూడా అగ్గి మీద గుగ్గిలమై పోయింది వాసంతి.

అదృష్టంకొద్దీ మర్నాడే వాన వెలిసింది. తాత్కాలికంగా ఆ బాధ తప్పినా మళ్ళీ వర్షం వస్తే ఏం చేయాలనే దిగులు పట్టుకుంది. ఆ ప్రమాదం రాకముందే పరోపకారి పాపన్న దగ్గరకు పరుగెత్తాను.

నేను చెప్పిందంతా విని, "దీనికే ఇంత దిగులెందుకు? కాస్త సిమెంటు, ఇసుకా కలిపించి కప్పు పై భాగాన మెత్తిస్తే సరి!" అన్నాడాయన తేలిగ్గా తీసిపారేస్తూ.

"మీరు ఓనర్‌గారితో చెప్పి అదేదో చేయిస్తే..." అని నసిగాను. "ఆయన ఇల్లంటే మీకు అద్దె లేకుండా ఇచ్చాడుగానీ, ఎక్కడో దూరాన్న ఉన్న వాడిని మరమ్మతులు చేయించమనడం బావుండదు కదా? ఆ పనేదో మీరే చేయించుకుంటే మీరున్నంత కాలమూ హాయిగా ఉండొచ్చుకదా!" అన్నారు పాపన్నగారు. కాదు కాదు పాపిగాడు.

మరో ఇల్లు వెదుక్కుందామంటే ఆ ఊళ్ళో మరో ఇల్లు దొరికే అవకాశమే లేదు. చేసేది లేక తాపీమేస్త్రిని పిలిచి మాట్లాడితే.."అలాగే అదెంతపని? సిమెంటూ, ఇసుకా తెప్పించండి. చిక్కగా పాళ్ళు కలిపి పైనోసారి ప్లాస్టరింగ్ చేసి, బిళ్ళ పెంకు పరిపిస్తే మరో పదేళ్ళు చూసుకోనక్కర్లేదు" అన్నాడు.

లెక్కలు వేసి చూసుకుంటే..ఆ బృహత్కార్యక్రమానికి అయ్యే ఖర్చుతో ఓ రెండు గదుల ఇల్లు సునాయాసంగా కట్టుకోవచ్చనిపించింది. ఇంకొన్నాళ్ళు ఆ ఊళ్ళో ఉంటే డబ్బు వెనకేసుకోవడం కాదు కదా..దాచుకున్న డబ్బులన్నీ ఖర్చుపెట్టి అంతకు పదింతలు అప్పు చేస్తే తప్ప ఆ ఊళ్ళో మనుగడ సాగించడం కష్టమని అర్థమైపోయింది నాకు.

మర్నాడు ఆఫీసుకు వెళ్ళిన వెంటనే ఈ ఊరి నుంచి నన్ను సత్వరమే బదిలీ చేయమని మా ప్రధాన కార్యాలయానికి అర్జీ పెట్టుకోవడంతోపాటు, నేను అపరిపక్వ బదిలీని నా సమ్మతిమీద కోరుకుంటున్నాను కనుక మా సంస్థ నాకు ఎటువంటి ఆర్థిక బదిలీ లాభాలు ఇవ్వనవసరం లేదనీ అభ్యర్థిస్తూ సత్వరమే నన్నక్కడ్నించి బదిలీచేసి తత్సమానమైన అమూల్యమైన పుణ్యాన్ని మూటకట్టుకుని నా శేషజీవితాన్ని ప్రశాంతంగా గడిపే అవకాశాన్ని కల్పించవలసిందనీ విన్నవించుకున్నాను.

నా విన్నపం మన్నించబడిందనే శుభవార్త నా నోటినుంచి వినే శుభఘడియ కోసం రోజూ ఎదురు చూడ్డం ఓ అలవాటుగా మారింది వాసంతికి ఆనాటి నుంచీ.

ప్రస్తుతం ఆకాశంలో మేఘాలు కనిపిస్తే చాలు వర్షం కురవకుండానే వణికిపోతున్నాం ఇద్దరమూ!

☆



## వంద కోట్ల అందం

ఐశ్వర్యారాయ్‌కి సినిమాల్లో కంటే యాడ్స్‌లో వచ్చే ఆదాయమే మంచి గిట్టుబాటుగా వున్నట్టుంది. ఈ పదేళ్ల కాలంలో ప్రకటనల్లో కనిపించినందుకు ఐశ్వర్యకు వచ్చిన ఆదాయం వంద కోట్లట. అంటే సగటున ఏడాదికి పది కోట్లన్నమాట. కేవలం అడ్వర్టయిజ్‌మెంట్లలో కనిపించినందుకే ఇంత ఆదాయమైతే సినిమాల్లో వచ్చిన దాని సంగతి ఇక చెప్పేదేముంది? బాలీవుడ్‌లో బిజీ అండ్ క్రేజీ హీరోయిన్‌గా ఖ్యాతికెక్కిన ఐష్‌కి ఆదాయంలోనూ సాటివచ్చేవాళ్లు ఇప్పట్లో లేరేమో!